Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 157 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 28 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# గురు గోవింద్ సింగ్ మనల్ని సత్యం, న్యాయం, ధర్మం కోసం నిలబడమన్నారు : ప్రధాని మోదీ



**ఢిల్లీ:** శ్రీ గురు గోవింద్ సింగ్ జీ మహారాజ్ జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మనల్ని సత్యం, న్యాయం, ధర్మం కోసం నిలబడమని, మానవ గౌరవాన్ని కాపాడమని ప్రేరేపించారని... ధైర్యం, కరుణ, త్యాగానికి ప్రతీక. గురూజీ జీవితం, ఆయన బోధనలు తరతరాలను సేవ, నిస్వార్థ కర్తవ్యం వైపు నడిపిస్తాయని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా.. ఈ ఏడాది, పాట్నాలోని సాహిబ్ తఖ్త్ శ్రీ హరిమందిర్‌ని సందర్శించుకున్న జ్ఞాపకాలను మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. అక్కడ గురుజీ, మాతా సాహిబ్ కౌర్ జీ.. పవిత్ర జోరే సాహిబ్ దర్శనం చేసుకున్నట్లు మోదీ తెలిపారు. అప్పటి ఫొటోలను మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా షేర్ చేశారు. ఇలా ఉండగా, గురు గోవింద్ సింగ్ జన్మదినం పురస్కరించుకుని ఇవాళ దేశంలోని గురుద్వారాలు అందంగా ముస్తాబయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు గురుద్వారాలు సందర్శిస్తున్నారు. ఆనంద్ పాఠ్, ప్రభాత్ ఫేరీలతో ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ముందు రోజు (డిసెంబర్ 26) వీర్ బాల్ దివస్‌ను జరుపుకున్నారు. సాహిబ్జాదా జోరావర్ సింగ్, ఫతేహ్ సింగ్‌ల త్యాగాన్ని స్మరించుకుంటూ.. గురుగోవింద్ సింగ్ జీ బోధనలు ఈనాటి సమాజానికి మార్గదర్శకాలు అని చెప్పారు.

## కత్తి తీస్తే కటకటాలకే.. గుర్తు పెట్టుకోండి.. వైసీపీకి హోంమంత్రి హెచ్చరిక

**అమరావతి, (రాజధాని వార్తలు):** మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తల వికృత చేష్టలపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా అని ప్రశ్నించారు. నడిరోడ్లపై అకారణంగా మూగజీవాల ఉసురు తీసి బలులు, రక్తాభిషేకాలు చేశారని మండిపడ్డారు. వైసీపీ సైకో మూక వికృత చేష్టలు చూస్తుంటే మానవత్వం ఉందా లేదా అనిపిస్తోందన్నారు. అధికారం కోల్పోయిన తరువాత కూడా రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసీపీ ముఠా ఎంతకైనా దిగజారుతోందని వ్యాఖ్యలు చేశారు. మూగ జీవాలను బలి తీసుకుని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వైసీపీ పార్టీ ఉన్మాదాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, కుప్పం, గోపాలపురం... ఇలా పలుచోట్ల మేక తలలు నరికి బహిరంగంగా నెత్తురు చల్లిన సంఘటనలు ఉన్నాయన్నారు. మీరు చేస్తున్నది తప్పు అని చెప్పిన గర్భిణీ స్త్రీ మీద వైసీపీ మూక ఉన్మాదుల మాదిరి దాడులు చేశారని ఫైర్ అయ్యారు. గర్భిణి మీద వైసీపీ సైకో దాడి జరిగితే ఈ రోజు వరకు జగన్మోహన్ రెడ్డి తప్పు అని ఖండించలేదన్నారు. గర్భిణీపై దాడి చేసిన కేసులో నీచుడిని అరెస్ట్ చేస్తే జనసేన కార్యకర్త అని మరో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అతను జనసేన కార్యకర్త అయితే జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలలో ఎందుకు పాల్గొంటారని ప్రశ్నించారు.



జగన్మోహన్ రెడ్డి రాజకీయ పబ్బం కోసం 20 ఏళ్ళలోపు యువతని బలి తీసుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి రాష్ట్ర యువత భవితను నాశనం చేశారని.. ఇప్పుడు రప్పా రప్పా అంటూ వైసీపీ ముఠా యువతను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రప్పా రప్పా అంటే జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు. కత్తి తీస్తే కటకటాల పాలవడం ఖాయమని వైసీపీ మూక గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ఇది రాక్షసుడు నడిపే ఆటవిక వైసీపీ పాలన కాదని.. శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే చంద్రన్న నాయకత్వంలో నడిచే కూటమి ప్రభుత్వ పాలన అని అన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఎటువంటి హింసను సహించదని, ఉపేక్షించదని హోంమంత్రి అనిత తేల్చి చెప్పారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ - ఇండియన్ నావల్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పందం



**గుంటూరు, (రాజధాని వార్తలు):** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ మరియు కేరళ రాష్ట్రం కన్నూర్ జిల్లా ఎఝిమలాలోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ నావల్ అకాడమీ (ఐఎన్ఏ) మధ్య అకడమిక్ మరియు పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసేలా అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇండియన్ నావల్ అకాడమీ ప్రిన్సిపల్ రియర్ అడ్మిరల్ జీ.రాంబాబుకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ ఎంఓయూ ద్వారా ఇరు సంస్థల మధ్య ఫ్యాకల్టీ మార్పిడి, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అంతర్జాతీయ కాన్ఫరెన్సులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాములు నిర్వహించనున్నట్లు తెలిపారు. అకడమిక్ సమాచార మార్పిడి, పరిశోధనా పబ్లికేషన్లు, అధ్యయన సామగ్రి పరస్పర మార్పిడి ద్వారా జ్ఞాన విస్తరణకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇండియన్ నావల్ అకాడమీ ఫ్యాకల్టీ సభ్యులు విజ్ఞాన్ యూనివర్సిటీలో తరగతులు, షార్ట్ టర్మ్ ప్రొఫెషనల్ కోర్సులు నిర్వహించడంతో పాటు, పరిశోధన ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం అందించనున్నారని తెలిపారు. అలాగే విజ్ఞాన్ యూనివర్సిటీ అధ్యాపకులు ఐఎన్ఏలో సెమినార్లు, నాణ్యతాభివృద్ధి కార్యక్రమాలు, శిక్షణ తరగతుల్లో పాల్గొననున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఎంటెక్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా అవకాశాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, పరిశ్రమ–అకడమిక్ అనుసంధానం, ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, లైబ్రరీ వనరుల పరస్పర వినియోగం సాధ్యమవుతుందని తెలిపారు. నావల్ క్యాడెట్లు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆధునిక ప్రయోగశాలలను వినియోగించుకునే అవకాశం పొందనుండగా, విజ్ఞాన్స్ విద్యార్థులు ఐఎన్ఏలో నిర్వహించే టెక్నికల్, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జాతీయ భద్రత, సాంకేతిక అభివృద్ధి, పరిశోధన రంగాల్లో నూతన ఆవిష్కరణలకు ఈ అవగాహన ఒప్పందం బలమైన పునాది వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, చాన్స్‌లర్ డాక్టర్ పావులూరు సుబ్బారావు, వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, ఇండియన్ నావల్ అకాడమీ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయానికే పెద్దపీట

**- జిల్లాల పునర్విభజనలో కొద్దిపాటి మార్పు చేర్పులు - 927 అభ్యంతరాలు, సూచనలపై సుదీర్ఘ చర్చ - నెల్లూరు జిల్లాకే గూడూరు - నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్ - మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు - జిల్లాల పునర్విభజనపై సమీక్షలో సీఎం చంద్రబాబు - ఈ నెల 31న తుది నోటిఫికేషన్ జారీ**




**అమరావతి, (రాజధాని వార్తలు):** జిల్లాల పునర్విభజనపై స్వల్ప మార్పు చేర్పులతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వ్యక్తమైన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. గత నెల 27న జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా 3 జిల్లాలు, 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో సహా వివిధ మార్పులపై నోటిఫికేషన్ విడుదల కాగా... దీనిపై నెల రోజుల పాటు ప్రభుత్వం అభ్యంతరాలను స్వీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 927 అభ్యంతరాలు, సూచనలు రాగా... వాటిపై క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**నెల్లూరు జిల్లాలోకే తిరిగి 5 మండలాలు**

గూడూరు ప్రజల అభిప్రాయం మేరకు గూడూరు నియోజకవర్గంలోని 5 మండలాలలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కలపాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అలాగే రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో, రాయచోటిని మదనపల్లి జిల్లాలో, రాజంపేట, సిద్ధవటం, ఒంటిమిట్టను కడప జిల్లాలో విలీనం చేయాలన్న అంశంపైనా చర్చ జరిగింది. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. విస్తీర్ణపరంగా పెద్దదైన ఆదోనిని రెండు మండలాలుగా విభజించాలనే అభిప్రాయానికి వచ్చారు. మరోవైపు, అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్ ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. మునగపాకను అనకాపల్లి డివిజన్‌లోనూ, అచ్యుతాపురంను అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటుకానున్న పోలవరం జిల్లాలో ఎటువంటి మార్పు చేయలేదు...ప్రాథమిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టుగా యధావిధిగా కొనసాగించాలని సీఎం సూచించారు. ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు ఈ ప్రాంతాలు యధావిధిగానే... శ్రీకాకుళం జిల్లాలోని నందిగం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చడం. అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌కు మార్చడం. కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌కు మార్చడం. అద్దంకి రెవెన్యూ డివిజన్‌లోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిసపాడును ప్రకాశం జిల్లాలోకి మార్పు చేయడం. కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు... ప్రకాశం జిల్లాలో విలీనం. కందుకూరు డివిజన్‌లోని 5 మండలాలను ప్రకాశం జిల్లాకు మార్చడంతో పాటు... కందుకూరు డివిజన్‌లోని మిగిలిన రెండు మండలాలు అయిన వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లోకి మార్పు. పలమనేరు డివిజన్‌లోని బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు మార్పు. చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరును మదనపల్లి రెవెన్యూ డివిజన్‌కు మార్చడం. చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమలను మదనపల్లి జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌కు మార్పు. శ్రీ సత్యసాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు. కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమడగురు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మార్పు చేర్పుల తర్వాత ఈ డిసెంబర్ 31న తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయనుంది. సమీక్షా సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులకు సీఎం చంద్రబాబు మనసున్న మాటలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారు. గిరిజన కుటుంబాల జీవనోపాధి బలోపేతం కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐటిడిఏ ద్వారా 90% సబ్సిడీతో పరికరాలు మంజూరు చేస్తున్నారు. గత జగన్ ప్రభుత్వం ట్రైకార్ రుణాలు ఆపి గిరిజనులకు అన్యాయం చేసింది. మంజూరు చేసిన పరికరాలు: ట్రాక్టర్లు & మినీ ట్రాక్టర్లు, రవాణా కోసం ట్రక్కులు, పంట రక్షణ కోసం టారపాలిన్‌లు, ఆయిల్ ఇంజిన్లు, గోకులాలు ఈ పరికరాల ద్వారా రైతుల శ్రమ తగ్గించి ఉత్పాదకత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గిరిజనుల ఉత్పత్తులు మార్కెట్‌కి సులభంగా చేరేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు.



## ఐదుగురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వ కార్యదర్శులుగా పదోన్నతి

**అమరావతి, (రాజధాని వార్తలు):** 2010 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులను సూపర్ టైమ్ స్కేల్ (పే మ్యాట్రిక్స్ లెవల్–14)కు, క్యాడర్‌కు సమానంగా, 2026 జనవరి 1 నుండి అమలులోకి వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ప్రభుత్వ కార్యదర్శులుగా పదోన్నతి పొందిన అధికారులలో చదలవాడ నాగరాణి, డా.నారాయణ భరత్ గుప్తా, అమ్రపాలి కటా, జె.నివాస్, గంధం చంద్రుడు ఉన్నారు. పదోన్నతుల అనంతరం డా.నారాయణ భరత్ గుప్తాను అదే పదవిలో కొనసాగిస్తూ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్, ఆర్‌యూఎస్ఏ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. అమ్రపాలి కటా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. గంధం చంద్రుడిని కార్మిక శాఖ కమిషనర్‌గా నియమిస్తూ, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.వి. శేషగిరి బాబును రిలీవ్ చేశారు. చదలవాడ నాగరాణి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా అదే పదవిలో కొనసాగనున్నారు. అవసరమైన చోట్ల పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్, క్యాడర్ సమానత్వానికి సంబంధించిన ఉత్తర్వులు వేరుగా జారీ చేస్తామని ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.

# విఎస్‌యూ విద్యార్థినులకు యూనియన్ బ్యాంక్ కానుక

## 'ఎంపవర్ హర్' ఈ-వెహికల్ ప్రారంభించిన విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విద్యార్థులు, సిబ్బంది రవాణా సౌకర్యాల మెరుగుదలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక సహకారం అందించింది. యూనియన్ బ్యాంక్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో, మహిళా సాధికారత లక్ష్యంగా చేపట్టిన 'ఎంపవర్ హర్' కార్యక్రమం కింద ఒక నూతన 8-సీటర్ బ్యాటరీ వాహనాన్ని (ఈ-వెహికల్) విరాళంగా అందజేసింది. ఈ వాహనాన్ని శుక్రవారం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఘనంగా ప్రారంభించారు.

**రవాణా కష్టాలకు స్వస్తి**

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ, వర్సిటీ ప్రధాన రహదారి నుండి క్యాంపస్ సుమారు ఒక కిలోమీటరు దూరంలో ఉండటం వల్ల విద్యార్థులు, ముఖ్యంగా మహిళా విద్యార్థులు మరియు సిబ్బంది ఎండలో, వానలో నడిచి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. తమ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించి, పర్యావరణహితమైన ఈ వాహనాన్ని అందించిన యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సుమారు 1300 మంది విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బందికి ఈ వాహనం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**మహిళా సాధికారతే లక్ష్యం**

యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ & అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బందారు శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, మహిళా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 'ఎంపవర్ హర్' పథకం కింద ఈ సహకారం అందించినట్లు తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ, గతంలో కూడా యూనియన్ బ్యాంక్ వర్సిటీకి అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకుందని గుర్తు చేశారు.

**విద్యార్థుల హర్షం**

మైపాడు వంటి సుదూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు, గర్భిణీలకు మరియు చిన్న పిల్లలతో పరీక్షలకు వచ్చే మహిళా విద్యార్థులకు ఈ వాహనం ఒక వరంగా మారిందని విద్యార్థిని బి.శ్రావణ కుమారి, సిబ్బంది యన్.బేబీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్. విజయ, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.సి.ఎస్. సాయి ప్రసాద్ రెడ్డి, సహాయక రిజిస్ట్రార్ డా. జి. సుజయ్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ మిస్టర్ బి. శివ శంకర్, బ్రాంచ్ హెడ్ మిస్టర్ షేక్ అబ్దుల్ ఆలీమ్, ఎంపవర్ హర్ కమిటీ సభ్యులు షేక్ జహీరా, ఎస్.అరుణ, డి.స్వరూపతో పాటు వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు దత్తత గ్రామం పీఎం లంకలో నిర్మలా సీతారామన్ పర్యటన

## - సీఎస్ఆర్ నిధుల ఆలంబనతో అభివృద్ధిలో అగ్రగామిగా పీఎం లంక - జనవరి నాటికి కోత నిరోధక కట్ట పనుల పూర్తి : కలెక్టర్ నాగరాణి

**భీమవరం, (రాజధాని వార్తలు):** పశ్చిమ గోదావరి జిల్లా పెదమైనవానిలంక (పీఎం లంక) గ్రామం సమగ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరే కేంద్ర మంత్రి, ఉదయం 11 గంటలకు పీఎం లంకలోని డిజిటల్ బిల్డింగ్‌కు చేరుకుని 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సియెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డ్రోన్లు, కృత్రిమ మేధస్సు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, 'వికసిత్ భారత్ - డిజిటల్ ఇండియా' థీమ్‌పై రూపొందించిన చిత్రాలను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా గేమ్ హబ్ / గేమ్ ఫౌండేషన్, ఎగ్జిమ్ బ్యాంక్‌లతో ఎంఓయూల సంతక కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. కేంద్ర మంత్రి పర్యటనలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా జీవనోపాధి చెక్కుల పంపిణీ జరగనుందని చదలవాడ తెలిపారు. అలాగే "వికసిత్ భారత్ - డిజిటల్ ఇండియా" అంశంపై విద్యార్థుల చిత్రలేఖన పోటీలు, "వందే మాతరం" అంశంపై గాన పోటీల విజేతలకు బహుమ



తులు ప్రదానం, అనంతరం డెలాయిట్ ఆధ్వర్యంలో నిర్మించిన గేబియన్ వాల్ నిర్మాణాన్ని కేంద్ర మంత్రి పరిశీలిస్తారు. నరసాపురంలో భోజన విరామం అనంతరం కవితమ్ దేవాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని విజయవాడకు తిరిగి వెళ్తారని కలెక్టర్ వివరించారు. పీఎం లంక గ్రామాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దత్తత తీసుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం లభించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేద మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల కోసం పడవలు, వేట జాలాలు, త్రిచక్ర వాహనాలు, ఐస్ బాక్స్‌లతో కూడిన మోపెడ్‌లను అందిస్తూ రూ.50 లక్షల విలువైన సహకారం అందించడం ప్రశంసనీయమని అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జడ్పీ హైస్కూల్ మౌలిక వసతుల అభివృద్ధికి భవన రంగుల పనులు, బెంచీలు, ఫర్నిచర్, సైన్స్ ల్యాబ్ పరికరాలు, కంప్యూటర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం అందించడంతో పాటు డిజిటల్ కమ్యూనిటీ భవన్ అభివృద్ధికి తోడ్పడి రూ.21.86 లక్షల సీఎస్ఆర్ సహాయం అందించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాబార్డ్ సంస్థ మత్స్యకార కుటుంబాల ఆర్థిక స్థిరత్వం కోసం పడవలు, వేట జాలాలు, వాహనాలను అందిస్తూ రూ.26.50 లక్షల సహాయం చేయడం గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. అలాగే ఎగ్జిమ్ బ్యాంక్ మహిళా సాధికారత లక్ష్యంగా లేస్ తయారీ, కుట్టు నైపుణ్యాలు, జుకీ మెషిన్ ఆపరేషన్, నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలను రూ.35.77 లక్షల వ్యయంతో నిర్వహించడం మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరిస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పీఎం లంక గ్రామ దీర్ఘకాల భద్రత దృష్ట్యా సముద్ర తీరం కోతను నివారించేందుకు 1,000 మీటర్ల పొడవైన కోత నిరోధక కట్ట (యాంటీ-ఎరోషన్ ఎంబాంక్‌మెంట్) నిర్మాణ ప్రాజెక్టును రూ.13.72 కోట్ల వ్యయంతో అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పర్యవేక్షణకు డెలాయిట్ టచ్ తోహ్మాట్సు ఇండియాను నియమించగా, జలవనరుల శాఖ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ నిరంతర పర్యవేక్షణ చేస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు సుమారు 55 శాతం పూర్తయ్యాయని, కొంత ఆలస్యం జరిగినప్పటికీ 2026 జనవరి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా వేగంగా సాగుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. విభిన్న కార్యక్రమాల అమలు ద్వారా పీఎం లంక గ్రామం స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విద్య, డిజిటల్ సదుపాయాలతో సమగ్రంగా అభివృద్ధి చెందుతున్న ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటోందని నాగరాణి తెలిపారు.

ఈ అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రికి, సీఎస్ఆర్ సహకారం అందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, ఎగ్జిమ్ బ్యాంక్ ప్రతినిధులకు, అలాగే నిరంతరం పర్యవేక్షణ చేస్తున్న అధికారులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపేలా సమిష్టి కృషితో ముందుకు సాగుదామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు.

# క్రీడలతో సర్వతోముఖాభివృద్ధి

**గూడూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థుల మానసిక, శారీరక ఉల్లాసానికి, చదువుతోపాటు క్రీడా పోటీలలో పాల్గొనడం అవసరమని, క్రీడలతో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నాయుడుపేట- గూడూరు- సూళ్లూరుపేట జోన్ పరిధిలోని నారాయణ పాఠశాలల ప్రీమియర్ లీగ్ పోటీలను విబిఆర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డితో పాటు గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డి.ఎస్.పి గీతా కుమారి, గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వక్సేన్, ఏజీఎం రియాజ్ తదితరులు పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించి వందన సమర్పణ చేశారు.

ఈ సందర్భంగా విబిఆర్ మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో పాఠశాలల స్థాయి నుండి వివిధ క్రీడా పోటీలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి ర్యాంకులు సాధించడంతోపాటు వివిధ క్రీడా పోటీలలో రాణించాలన్నారు. క్రీడా పోటీలలో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, అలవరుతా యన్నారు. కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా ఇటు వంటి క్రీడా పోటీలలో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎంలు, డిజీఎం ప్రిన్సిపాల్ ఏఓలు పాల్గొన్నారు.

# మంత్రి నారాయణ సమీక్ష సమావేశం





**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి పి. నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జరీబు భూ సమస్యలపై సర్వే పూర్తయిందని, జరీబు భూములపై జెన్యూన్‌గా ఎవరికి ఇవ్వాలి అనేదానిపై కమిటీ రిపోర్ట్ తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్నవాళ్లు 415 మంది ఉన్నారని, వారి సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామని చెప్పారు. 2013 కంటే ముందు భూములు ఇచ్చిన రైతులు కూడా తమను ల్యాండ్ పూలింగ్ కింద పరిగణించమని అడుగుతున్నారని, కానీ అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదని తెలిపారు. వీధి పోటు భూములకు సంబంధించి సుమారు 150 ఉన్నాయని, వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని, ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని చెప్పారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం తిరిగి లంక భూముల విషయంలో 356కు గాను 79 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగిలిన వారిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోమని కోస్తున్నామని తెలిపారు.

# రైతుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఆర్డీఏ కార్యాలయంలో త్రీ మెన్ కమిటీ శనివారం సమీక్ష నిర్వహించింది. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. జరీబు భూ సమస్యలపై సర్వే పూర్తయిందన్నారు. జరీబు భూములపై జెన్యూన్‌గా ఎవరికి ఇవ్వాలి అనేదానిపై కమిటీ రిపోర్ట్ తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్నవాళ్లు 415 మంది ఉన్నారని... వారి సమస్యలు కూడా పరిష్కరిస్తు న్నామన్నారు. 2013 కంటే ముందు భూములు ఇచ్చిన రైతులు కూడా తమను ల్యాండ్ పూలింగ్ కింద పరిగణించమని అడుగుతున్నారని... కానీ అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదని కేంద్ర మంత్రి అన్నారు. వీధి పోటు భూములకు సంబంధించి సుమారు 150 ఉన్నాయని.. వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని. ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని స్పష్టం చేశారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం తిరిగి లంక భూముల విషయంలో 356కు గాను 79 మంది మాత్రమే రిజి స్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన వారిని కూడా రిజిస్ట్రే షన్ చేయించుకోమని కోరారు. గన్నవరం ఎయిర్పోర్ట్ సమస్యలపై కూడా ఈ రివ్యూలో చర్చించినట్లు తెలిపారు. లార్జ్ రిటర్నబుల్ ప్లాట్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. పరిష్కారం దిశగా వర్క్ చేస్తున్నామన్నారు. హెల్త్ కార్డ్స్, పెన్షన్లు తదితర అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. స్థానికంగా 1596 మం దిని క్యాపిటల్ వర్క్స్‌లో అధికారులు జాయిన్ చేసుకున్నారని.. ఇవి కాకుండా మరో 10 వేల మందిని రాజధానిలో ఉండే స్థానికులను కలిపే విధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. పెండింగ్ ఉన్న 2% రైతులకు కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని ఒక్కోటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటి వరకు లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పుకొచ్చారు.

**వారందరికీ పెన్షన్లు ఇస్తాం: ఎమ్మెల్యే శ్రావణ్**



ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. రోడ్ల నిర్మాణలు, భారీ వాహనాల రాకపోకల వల్ల కొన్నిచోట్ల స్మశాన ప్రాంతాలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. మల్కాపురం, వెంకటాపురం గ్రామాల్లో స్మశానాలు లేవని...అలాగే మరికొన్ని ప్రాంతాల్లో బరెల గ్రౌండ్ ఏర్పాటు చేయాలని చెప్పామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగు వేలకు పైగా పెన్షన్లను రిజెక్ట్ చేశారని.. ఎవరెవరికి పెన్షన్లు మిస్ అయ్యాయో వాటి వివరాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామని చెప్పారు.

**శవ రాజకీయాలు మానుకోండి..**

అమరావతిలో భూమి ఇచ్చిన వారికి బిలో పావర్టీ లైన్‌తో సంబంధం లేకుండా అందరికీ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిన్న జరిగిన ఒక గ్రామ సభలో మాట్లాడుతూ ఉండగా రైతు రామారావు అకస్మాత్తుగా మరణించడం జరిగిందన్నారు. ఆ రైతుకు ఐదు ఎకరాల భూమి ఉందని... సభలో కూడా రామారావు మాట్లాడుతూ తమకు అందించే భూమి ఎక్కడ వస్తుందో స్పష్టంగా చెప్పాలని అడిగారన్నారు. చాలా వివరంగా, ఆయన మామూలుగా మాట్లాడుతూ ఉండగా అనుకోకుండా జరిగిన ఘటనను కొన్ని పత్రికలు, వైసీపీ నాయకులు శవాల మీద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏమీ లేని చోట ఇలాంటి దుష్ప్రచారాన్ని చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాను : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, రెవెన్యూ శాఖ మంత్రికి, జిల్లా కలెక్టర్‌కి తన తరపున విజ్ఞప్తి నివేదికలను అందజేశానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విభజన నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యంతరాలు తెలియజేయడానికి నేటితో ఆఖరి రోజు కావడంతో ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి ఆనం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకు తమ వినతి పత్రాలు, అభ్యంతరాలను అందజేశారని మంత్రి వివరించారు. తాను రాపూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవంతో పాటు, ఆ ప్రాంతాల ప్రతినిధిగా, మంత్రిగా నెల్లూరు జిల్లా భవిష్యత్ దృష్ట్యా ఈ మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని, అలాగే ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ముఖ్యమంత్రికి విన్నవించానన్నారు. ఈ విషయమై జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకి కూడా తన విజ్ఞాపన పత్రాన్ని అందజేశానని తెలిపారు.

**నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేతలకు మంత్రి ఆనం అభినందనలు**

నూతనంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, నెల్లూరు ఇన్‌చార్జి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన రూప్‌కుమార్ యాదవ్‌లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నెల్లూరు జిల్లా పార్లమెంటు టీడీపీ కమిటీకి ఎంపికైన ఆత్మకూరు నేతలను, రాష్ట్రస్థాయిలో డైరెక్టర్ పదవులు పొందిన వారిని మంత్రి ఆనం సత్కరించారు. దివంగత నేత శ్రీ ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా భారత ప్రభుత్వం ముద్రించిన వంద రూపాయల నాణేలను జిల్లా పార్లమెంటు టీడీపీ కమిటీ సభ్యులకు అందజేస్తూ, ఎన్‌టిఆర్ స్ఫూర్తి, పరిపాలనా దక్షతను ఆదర్శంగా తీసుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

**సమర్థవంతమైన నాయకత్వంతో జిల్లా పార్టీ కమిటీ : మంత్రి ఆనం**

జిల్లాలో పార్టీ పటిష్టతకు సమర్థవంతమైన నాయకత్వంతో కూడిన జిల్లా కమిటీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ నియమించడం ఎంతో ఆనందకరమని మంత్రి ఆనం తెలిపారు. అనుభవం ఉన్న నాయకులు బీద రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి వంటి వారికి, సుదీర్ఘకాలంగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన నాయకులకు బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని పేర్కొన్న మంత్రి, ఈ సమర్థవంతమైన టీమ్‌తో అందరిని సమన్వయం చేసుకుంటూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, అలాగే నెల్లూరు జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి సి సి బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజరెడ్డి, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, స్థానిక నేతలు గిరి నాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామక పత్రాలు అందచేసిన జిల్లా కలెక్టర్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శుక్రవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వివిధ శాఖలలో విధి నిర్వహణలో ఉంటూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలు వారి చాంబర్లో అందజేశారు.

అందులో సర్వే శాఖలో సర్వేయర్‌గా పనిచేస్తూ మరణించిన షేక్ హజరత్, కుమారుడు షేక్ మస్తాన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్లో నియమిస్తూ కారుణ్య నియామకం పత్రం అందజేశారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్‌లో వాచ్మెన్‌గా పనిచేస్తూ మరణించిన మహబూబ్ సుభాని కుమారుడు షేక్ ఖలీల్‌కు జూనియర్ అసిస్టెం ట్‌గా జిల్లా కోఆపరేషన్ డిపార్ట్మెంట్లో నియమిస్తూ కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు.

# నెల్లూరు నగరపాలక సంస్థ పూర్వపు సిటీ ప్లానర్ హిమబిందు జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు.



# టిడిపి ఉపాధ్యక్షులుగా సికిందర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు మనుబోలు సికిందర్ రెడ్డి నెల్లూరు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా నెల్లూరు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రని మర్యాదపూర్వకంగా కలిశారు.

# వీఎస్‌యూలో అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

**- జనవరి నెలలో 29, 30 తేదీల్లో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ**

**- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో బహుళ రంగాల సమన్వయం కీలకం : వీసీ**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం లోని సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీలలో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ఈ సదస్సుకు సంబంధించిన ప్రచార పత్రాలను శుక్రవారం సాయంత్రం పరిపాలన భవనంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. "అడ్వాన్సింగ్ ఎస్‌డీజీస్ త్రూ మల్టీడిసిప్లినరీ కొలాబరేషన్: పాత్‌వేస్ టు సోషల్ డెవలప్‌మెంట్" అనే ప్రధానాంశంపై ఈ సదస్సు జరగనుంది.

**బహుళ రంగాల సమన్వయంతోనే అభివృద్ధి : వీసీ**

బ్రోచర్ ఆవిష్కరణ అనంతరం వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే బహుశాఖల సమన్వయం అత్యంత ఆవశ్యకమని ఉద్ఘాటించారు. సామాజిక అభివృద్ధికి విద్య, పరిశోధన, విధాన రూపకల్పనల మధ్య సమగ్ర సహకారం అవసరమని తెలిపారు. ఈ అంతర్జాతీయ సదస్సు ద్వారా పరిశోధకులు, అకాడమిషియన్లు, సామాజిక కార్యకర్తల మధ్య జరిగే ఆలోచనల వినిమయం సమాజానికి మేలు చేసే దిశగా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**విశ్వవిద్యాలయాల పాత్ర కీలకం: రిజిస్ట్రార్**

ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

సామాజిక సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో బహుశాఖల సమన్వయంతో నిర్వహించే ఇటు వంటి సదస్సులు విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు విస్తృత దృక్పథాన్ని అందిస్తాయని తెలిపారు. పరిశోధన ఫలితాలు కేవలం గ్రంథాలయాలకే పరిమితం కాకుండా, సమాజానికి చేరువవుతూ అభివృద్ధికి దోహదపడాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి ఆర్. మధుమతి, అధ్యాపకులు డా.బి.వి. సుబ్బారెడ్డి, విద్యార్థులు మరియు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# నారాయణలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని నారాయణ స్కూల్, స్టోన్ హౌస్ పెట్ క్యాంపస్‌లో ఈ రోజు చిన్నారుల ప్రతిభను వెలికి తీసే కార్యక్రమంగా EKIDZ విభాగానికి (నర్సరీ, PP1, PP2) చెందిన విద్యార్థులకు Rhymes Competition ను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ అందమైన భావప్రకటన, స్పష్టమైన ఉచ్చారణ, ఆత్మవిశ్వాసంతో వేదికపై అద్భుతంగా రైమ్స్ ప్రదర్శించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించే విధంగా విద్యార్థులు ఎంతో యాక్టివ్‌గా మరియు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెంచల ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రేష్మ, ఏఓ ప్రభాకర్ కోఆర్డినేటర్ స్రవంతి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. పోటీలో విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. పాల్గొన్న ప్రతి చిన్నారిలో సృజనాత్మకత, వేదిక భయం లేకుండా మాట్లాడే నైపుణ్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. నారాయణ సంస్థలు ఎల్లప్పుడూ విద్యతో పాటు సహపాఠ్య కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తూ, పిల్లల సమగ్రాభివృద్ధి కోసం ఇటు వంటి కార్యక్రమాలను నిరంతరంగా నిర్వహిస్తాయని వారు పేర్కొన్నారు.

# మాజీ మంత్రి నల్లపరెడ్డిని కలిసిన విడవలూరు యువత



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గం, విడవలూరు మండలానికి చెందిన యువ నాయకులు యన్. దినేష్, పి. దినేష్, సన్నీ పవన్ ధర్మతేజ మరియు వారి అనుచరులు దాదాపు 50 మందికి పైగా మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డితో కలసి మాజీ మంత్రివర్యులు, వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని మరియు కోవూరు నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్ కుమార్ రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో పూల మొక్కలు బహుకరించి మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది.



# పెంకె శ్రీనివాస్ బాబాకి శుభాకాంక్షలు తెలిపిన బీసీ నాయకులు తాతారావు వెంకటేష్

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పింకే శ్రీనివాస్ బాబాకి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంఖ్యామసంఘం జిల్లా అధ్యక్షులు విన్నకోట వెంకటేష్ జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు అలయన్స్ కొమ్మన తాతారావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

# గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

**- ఏపీసిసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి**



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోకేష్ బాబులు ఇచ్చిన హామీలను అమలుపరచాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గూడూరు ఆర్డీవో కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కలసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ఆర్డీవో కార్యాలయ ఏఓకి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైకా, నిమ్మకు గూడూరు పెట్టింది పేరని దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉందని అన్నారు. గూడూరును జిల్లా కేంద్రం చేస్తే ఇంకా ఎంతో అభి వృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య, సర్వేపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పూల చంద్ర శేఖర్, బిసి నాయకులు జి.సుబ్బురామరాజు, బ్రహ్మయ్య, జిల్లా మైనారిటీ నాయకులు ఫయాజ్, గౌస్ బాషా, ఇబ్రహీం పి.శ్రీనివాసులు, అనిల్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గాంధీ పథమా? లెనిన్ మార్గమా?

అహింసా ప్రవక్త మహాత్ముడు, అక్టోబర్ విప్లవ నిర్మాత లెనిన్ చింతనా ధోరణులలోని తారతమ్యాలను నిశితంగా విశ్లేషించిన, సాదృశ్యాలను ఎత్తిచూపిన వంద సంవత్సరాల నాటి ఒక ఆసక్తికరమైన పుస్తకాన్ని నేను ఇటీవల చదివాను. 'లెనిన్ అండ్ గాంధీ' అనేది ఆ పుస్తకం శీర్షిక. గ్రంథకర్త ఆస్ట్రియన్ రచయిత, చరిత్రకారుడు రెనే ఫ్యులోప్ మిల్లర్ (1891-1963). తొలుత ఫ్రెంచ్ భాషలో ప్రచురితమైన ఈ పుస్తకం 1927లో ఆంగ్లంలోకి అనువదితమయింది. గాంధీ, లెనిన్‌లు సమకాలికులు. ఆరునెలల తేడాతో వారు ఈ ప్రపంచంలోకి ప్రవేశించారు. ఇరువురూ మధ్యతరగతి కుటుంబాలలో జన్మించారు. పేదరికం, అన్యాయాల నుంచి మానవకోటిని విముక్తం చేయాలనే ప్రగాఢ ఆకాంక్ష వారి జీవితాలను విలక్షణంగా నడిపించింది. లెనిన్ తన రచనలలో కనికరం లేని కఠిన వాదనలు చేసేవారు. గాంధీ ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ చాలా నాగరీకంగా వ్యవహరించేవారు. మరో ముఖ్యమైన తేడా-లెనిన్ హింసను ఆరాధించి హింసాత్మక పద్ధతులను అనుసరించారు. అహింసకు అంకితమయిన ఉదాత్తుడు గాంధీజీ. మనసా వాచా కర్మణా అహింసావాది. నాకు తెలిసినంతవరకు గాంధీ, లెనిన్‌ల భావజాలాలను తులనాత్మకంగా పరిశీలించిన తొలి రచయిత బొంబాయి కమ్యూనిస్టు శ్రీపాద్ అమృత్ డాంగే (1899-1991). 1921లో ఆయన 'గాంధీ వర్సెస్ లెనిన్' అనే ఒక చిన్న పుస్తకాన్ని రాశారు. ఈ కమ్యూనిస్టు సహజంగానే గాంధీ కంటే లెనిన్ వైపే మొగ్గారు. అయితే తన స్వదేశీయుడి భావాలు, ఆలోచనల పట్ల ఆసక్తి, సానుభూతిని నిలుపుకున్నారు. 'గాంధీ, లెనిన్ సిద్ధాంతాలు ఆచరణాత్మక జీవితంలో సాకారమవ్వడం అసాధ్యం' అని డాంగే వ్యాఖ్యానించారు. డాంగే పుస్తకం వెలువడిన నాలుగు సంవత్సరాలకు హ్యారీ వార్డ్ (1873-1960) అనే అమెరికన్ మెథడిస్ట్ క్రైస్తవ పండితుడు 1925 ఏప్రిల్‌లో 'ది వరల్డ్ టుమారో' అనే జర్నల్‌లో 'లెనిన్ అండ్ గాంధీ' అనే వ్యాసాన్ని రాశారు. గాంధీ, లెనిన్ ఇరువురూ తమ మధ్యతరగతి నేపథ్యాన్ని అధిగమించి, తమ నిరాడంబర జీవనశైలుల ద్వారా సామాన్య మానవులతో తాదాత్మ్యమయ్యారని వార్డ్ పేర్కొన్నారు. వారి మధ్య వ్యత్యాసాలను వివరిస్తూ పీడకుల ఆధిపత్యాన్ని వారి హింసాత్మక పద్ధతులను మరింతగా అనుసరించడం ద్వారానే అధిగమించగలమని లెనిన్ విశ్వసించగా, ప్రత్యామ్నాయ పద్ధతులలో పీడకులపై విజయం సాధించగలమని గాంధీ భావించారు, ఆచరించారు' అని వ్యారీ వార్డ్ రాశారు. లెనిన్, గాంధీల భావాలు, ఆదర్శాలు వారి వారి దేశాల చరిత్రలను మార్చడమే కాకుండా ప్రపంచ చరిత్రను మలుపు తిప్పాయని వార్డ్ అభిప్రాయడ్డారు. 1927లో 'గాంధీ అండ్ లెనిన్'ను ప్రచురించిన రెనే మిల్లర్‌కు డాంగే, వార్డ్ రచనల గురించి తెలిసి ఉండే అవకాశం లేదు. అయితే ఆయన కూడా మొదటి ఇరువురు అభిప్రాయపడినట్టుగానే లెనిన్, గాంధీలు చరిత్ర గతిని మార్చివేశారని సునిశ్చితంగా విశ్వసించారు. రష్యాలో కార్మికులు, కర్షకుల మధ్య దృఢమైన, నిర్మాణాత్మక సంబంధాలను పెంపొందించేందుకు లెనిన్, భారత్‌లో హిందువులు-ముస్లింల మధ్య సామరస్య సంబంధాలను నెలకొల్పేందుకు గాంధీ అనితర సాధ్యమైన కృషి చేశారని మిల్లర్ పేర్కొన్నారు. దోపిడీకి తావులేని వర్గరహిత సమాజాన్ని స్థాపించడమనే లక్ష్యసాధనకు హింసాత్మక పద్ధతులను అనుసరించడం మినహా మరో మార్గం లేదని లెనిన్ విశ్వసించగా, ప్రతికూల పరిస్థితులలోనూ అహింసాత్మక, ప్రేమ పద్ధతులలో గాంధీ తన వ్యక్తిగత, రాజకీయ ప్రత్యర్థులపై పోరాడి చరిత్రాత్మక ఫలితాలు సాధించారని మిల్లర్ పేర్కొన్నారు. హ్యారీ వార్డ్ వ్యాసం వెలువడిన ఒక సంవత్సరం అనంతరం, రెనే మిల్లర్ పుస్తకం ప్రచురణకు ఒక ఏడాది ముందు, అంటే 1926లో ఫిలిప్ స్ప్రాట్ (జననం 1902) అనే బ్రిటిష్ యువ కమ్యూనిస్టు భారత్‌కు వచ్చారు. ఈ దేశంలో కమ్యూనిస్టు విప్లవాన్ని పురిగొల్పడమే అతడి రాక లక్ష్యం. ఆస్ట్రియన్ మిల్లర్, అమెరికన్ వార్డ్ వలే స్ప్రాట్ రచయిత కాదు. అయితే లెనిన్ బాటలో నడిచేందుకు నిర్ణయించుకున్న క్రియాశీల వ్యక్తి. రెండు సంవత్సరాల పాటు భారత ఉపఖండమంతటా ఈ యువ కార్యకర్త పర్యటించారు. భారతీయ విప్లవకారులతో సంబంధాలను నెలకొల్పుకున్నారు. విప్లవ సాధ్యతకు గల అవకాశాలను చాలా నిశితంగా పరిశీలించారు. 1929 వేసవిలో స్ప్రాట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర భారతీయ కామ్రేడ్లతో పాటు అతడినీ మీరట్ కుట్రకేసులో ముద్దాయిగా కోర్టు బోనులో నిలబెట్టారు. దాదాపు ఒక దశాబ్దం పాటు స్ప్రాట్ జైలు జీవితం గడిపారు. కారాగారవాసంలో భారత దేశ చరిత్ర, తాత్విక సంప్రదాయాలు, సాహిత్యం విస్తృతంగా అధ్యయనం చేశారు. అంతకు ముందు ఇవన్నీ అతడికి పెద్దగా అవగాహన లేని అంశాలు. ఈ ప్రగాఢ అధ్యయనం మూలంగా లెనినిస్టు భావజాలం ఒకప్పుడు తనను అనుమతించినదానికంటే ఎక్కువ సహానుభూతితో గాంధీని అర్థం చేసుకునేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. జైలు నుంచి విడుదల అయిన వెంటనే సేవాగ్రామ్ వెళ్లి గాంధీజీని దర్శించారు. అనేక అంశాలపై మహాత్ముడితో మాటా మంతీ జరిపారు. ఆ సంభాషణల స్ఫూర్తితో పాటు గాంధీజీ రచనల నిశిత అధ్యయనం ఆధారంగా ఆ మహోన్నత భారతీయుని చింతనా ధోరణి, భావ విశిష్టత గురించి 'Gandhism : An Analysis' అనే పుస్తకాన్ని స్ప్రాట్ రాశారు. లెనిన్ విప్లవ తాత్త్వికత, గాంధీ మానవతా దార్శనికత మధ్య సమన్వయం సాధించేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. 'గ్రామీణ భారతదేశంలో ప్రస్తుతం నెలకొని వున్న పరిస్థితులలో కోట్లాది ప్రజలను అనివార్యమైన దానికంటే ఒక్కరోజు పాటు అదనంగా వదిలివేసినా నేరం అవుతుంది. విదేశీ దురాక్రమణల ప్రమాదాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రష్యన్లు మరింతగా దారిద్ర్యంలో కునారిల్లవలసి ఉన్నది. పాలనలో, సమాజ నిర్మాణంలో క్రూర పద్ధతులను అనుసరించవలసి ఉన్నది.

# పోలీసులు సామాజిక సేవల్లోనూ భాగస్వాములు కావాలి

## - పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పోలీసులు విధి నిర్వహణతో పాటు సామాజిక సేవలో కూడా భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ మానవసేవే మాధవసేవ అని భావించి ఉన్నంతలో తోటివారికి సహాయం చేయాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన టూటౌన్ లా అండ్ ఆర్డర్, క్రైం, స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ 01 మణికంఠ చందోలు, ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కే.లక్ష్మణమూర్తి, ఇంచార్జ్ క్రైం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, టూటౌన్ సీఐ వీ.వీ.సీ.ఎం.ఎర్రం నాయుడు, ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ సీహెచ్.రాజుల నాయుడు, సీసీఎస్ సీఐ కోరాడ రామారావు ఇతర అధికారులు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ పూర్ణ కుంభంతో పోలీస్ కమిషనర్కు స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అలాగే సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, మొక్కలను నాటారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు నిబద్ధతతో పని చేయాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అధికారులకు ఆదేశించారు. సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని, విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 33వ వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంత లక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాలలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, నిరుపేదలకు పండ్లు ఫలాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు సతీష్, మన్మథరావు, లక్ష్మి, సంధ్య, రమేష్, క్రైం ఎస్ఐ నాయుడు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 31నే పింఛన్ల పంపిణీ :

## జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** సామాజిక పింఛన్ దారులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. జనవరి 1కి బదులుగా ఒకరోజు ముందుగా ఈ నెల 31నే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటలు నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్లను అందజేస్తారని తెలిపారు. డిసెంబరు నెలకు గాను జిల్లాలో 2,71,697 మంది పింఛన్ దారులకు మొత్తం రూ.116.25 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నగదును 30వ తేదీన బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని, సంబంధిత సచివాలయాల సిబ్బంది నగదు విత్‌డ్రా చేసుకొని, పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# డాక్ యార్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

## - అసోసియేషన్ సభ్యులకు నూతన సంవత్సర కానుకలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** డాక్ యార్డ్ కేటీబి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేయడం జరుగుతుందని సంఘం గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షులు బత్తుల చిరంజీవి లు పేర్కొన్నారు. నూతన సంవత్సరము సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరికీ ప్రత్యేక బహుమతి ఉద్యోగుల క్యాలెండర్ ఆపై కీ చైన్ సింహాద్రి నాథుడు అలంకరణలతో కూడిన మరో ప్రత్యేక క్యాలెండర్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు బహుమతులు క్యాలెండర్ శుక్రవారం కాకాని నగర్ కేటీబి కళా క్షేత్రంలో గంట్ల శ్రీనుబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అసోసియేషన్‌లో 550 మంది శాశ్వత సభ్యులు ఉండగా సాధారణ సభ్యులు కూడా పెద్ద మొత్తంలో ఉన్నట్లు చెప్పారు. వీరందరికీ అసోసియేషన్ ద్వారా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కానుకలు అందజేస్తామన్నారు. అలాగే ఇటీవలే ఉద్యోగులు పిల్లల్లో ప్రతిభ పాటవాలు ప్రదర్శించిన వారికి ఉపకార వేతనాలు అందజేసామన్నారు. ప్రత్యేక వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసా ఉన్నారు. తాజాగా సింహాచలంలో నిర్వహించిన వన సమారాధనలో 1000 మందికి పైగా సభ్యులు పాల్గొన్నట్లు చెప్పారు. అందరి సహకారంతో సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అధ్యక్షుడు బత్తుల చిరంజీవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాకి లెక్కలు కాదు. కాగ్ నివేదికపై స్పష్టత ఇవ్వండి



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** రాష్ట్ర సంపదను కొందరికి దోచి పెట్టడానికే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆరోపించారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె ప్రభుత్వ దివాళాకోరు విధానాన్ని ఎండగట్టారు.. ప్రభుత్వం ఆధికారం చేపట్టిన నాటి నుంచి ఆర్థిక లోటు కనిపిస్తోందని మండిపడ్డారు.. గడచిన 8 నెలల్లో 163 శాతం ఆర్థిక లోటుకు చేరిందని కాగ్ నివేదిక ఇవ్వడం ప్రభుత్వ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ శాతం కొంతమంది కాంట్రాక్టర్లకు దోచి పెట్టడమే కూటమి ప్రభుత్వ విధానంలా మారిందని వాపోయారు.. సంపద సృష్టిస్తానని సిఎం చంద్రబాబు చేసిన వాగ్ధానాలు మరచి అడ్డూ అదుపు లేకుండా అప్పులు చేసుకుంటూ పోతున్నారని తెలిపారు.. చేస్తున్న అప్పులు ఎక్కడి పోతున్నాయో కూడా చెప్పలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి చేరుకో వడం విచారకరమన్నారు. ఎన్ని అప్పులు చేస్తున్నా సంక్షేమ పథకాలు అమలు చేయలేని స్థితికి చేరుకోవడానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా పేదల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కంకణం కట్టుకోవడం దారుణమన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పావులు కదుపుతున్నాయని అందుకు నిదర్శనమే కేంద్రం వాటాను రాష్ట్రం పై రుద్దిందని వెల్లడించారు. దీని ద్వారా రాష్ట్రంపై ఏడాదికి 4259 కోట్లు ఆర్థిక భారంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది లబ్ధిదారులు నష్టపోతా రని ఆవేదన వ్యక్తం చేసారు. ఆయుష్ ఆస్పత్రిలో కీలకమైన ఆధ్యాయనం మొదలయ్యింది అని చెబుతున్న ప్రభుత్వం మాజీ ఐఏఎస్ అధికారి పివి రమేష్ సూచనల మేరకు ముఖ్యమంత్రి మంత్రులు అక్కడ చికిత్స చేయించుకోవాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరుగుతుందని కాగ్ పదే పదే చెబుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కుప్పలు తెప్పలుగా అప్పులు చేయడం మానుకుని ఆదాయం దృష్టి సారించాలని నాగమణి హితవు పలికారు.

# జన్నివలస అనాధ బాలురకు కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి అండ

## - ఇళ్లు, హాస్టల్ సీట్ల మంజూరుకు హామీ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** తల్లితండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన జన్నివలస గ్రామానికి చెందిన ఇద్దరు బాలురకు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అండగా నిలిచారు. వారికి ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా, చదువుకొనేందుకు సహకరిస్తామని, హాస్టల్ సీట్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జామి మండలం జన్నివలస గ్రామానికి చెందిన మైలపల్లి విజయ్(12), గౌతమ్(10) కొద్ది కాలంలోనే తల్లితండ్రులను కోల్పోయారు. వారి చిన్నతనంలోనే తండ్రి కేన్సర్‌తో మరణించగా, తల్లి ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో అనాథలుగా మారిన ఈ బాలురు ఇద్దరూ తమ పెద్దమ్మ ఎద్దు కొండమ్మ ఇంటివద్ద ఆశ్రయం పొందుతున్నారు. విజయ్ జామి జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి, గౌతమ్ గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విమలారాణి ద్వారా ఈ బాలురిద్దరూ తమ పెద్దమ్మతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలుసుకున్నారు. వీరి దయనీయ పరిస్థితిని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి చలించిపోయి, వారికి అన్నివిధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లు మంజూరు చేస్తామని, హాస్టల్ సీట్లను కేటాయిస్తామని చెప్పారు. బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆ బాలురకు కలెక్టర్ సూచించారు.

# దివ్యాంగునికి రమణారావు రూ.15 వేలు సాయం

**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దివ్యాంగునికి గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కుంచే రమణారావు ఆర్థిక సహాయం అందజేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన నిరుపేద దివ్యాంగుడు మందపల్లి వెంకట రామమూర్తి గృహ నిర్మాణం చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న రమణారావు వెంకట రామమూర్తికి ఆర్థిక సహాయంగా రూ.15 వేలు చెక్కును శుక్రవారం వెంకట రామమూర్తికి గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, పందిరి సుబ్బరాజు, ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్, విప్పర్తి రమేష్, ఎస్.చిరంజీవి, ఆంజనేయులు, మణికంఠ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# వంగవీటి మోహన్ రంగ 37వ వర్ధంతికి ఘనమైన నివాళి : వైస్సార్సీపీ ఇంచార్జి గన్నవరపు



**పి.గన్నవరం, (రాజధాని వార్తలు):** డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజవర్గం పి.గన్నవరం మండలం అక్విడేక్ట్ దగ్గర రాష్ట్ర నాయకులు మాజీ మండల కన్వీనర్ అడ్డగళ్ల సాయిరాం అధ్యక్షతన దివంగత నేత వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించిన పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ పాముల రాజేశ్వరిదేవి , మందపాటి కిరణ్ , దొమ్మేటి దుర్గారావు మిండగుద్దటి శిరీష్, నాయకులు ,కార్యకర్తలు , వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు , రంగా అభిమానులు , తదితరులు పాల్గొన్నారు.

# మహేష్ నెక్స్ట్ కోసం సరికొత్త ప్లాన్!



సూపర్‌స్టార్ మహేష్ బాబు తొలి సారి భారీ పాన్ ఇండియా మూవీ వారణాసిలో నటిస్తున్న విషయం తెలిసిందే. జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ మూవీని హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ కోసం మహేష్ దాదాపు రెండేళ్లు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ మరో ఎనిమిది నెలల్లో పూర్తి కాబోతోంది. ఎపిక్ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ డ్రామాగా రూపొందుతోంది. వరల్డ్ వైడ్‌గా భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న ఈ మూవీని 2027లో ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే ఈ భారీ పాన్ వరల్డ్ మూవీ తరువాత మహేష్ నెక్స్ట్ ప్లాన్ ఏంటీ? ..ఎలాంటి సినిమా చేయబోతున్నాడు అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభాస్‌ని బాహుబలితో జక్కన్న పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టిన విషయం తెలిసిందే. ఆ క్రేజ్‌ని కాపాడు ఆర్ఆర్ఆర్ తరువాత రామ్ చరణ్, ఎన్టీఆర్ ట్రై చేసి విఫలమయ్యారు. ఇప్పుడు మరోసారి పెద్దితో చరణ్, డ్రాగన్‌తో ఎన్టీఆర్ పాన్ ఇండియా క్రేజ్‌ని కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పుడు వారణాసి తరువాత మహేష్ వంతు రాబోతోంది. దీని తరువాత మహేష్ ఎలాంటి సినిమా చేస్తాడు? చరణ్, ఎన్టీఆర్‌ల తరహాలో తడబడతాడా? లేక ప్రభాస్ తరహాలో వరుస పాన్ ఇండియా సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తాడా? అని చర్చి జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికరమైన వార్త నెట్టింట జక్కర్లు కొడుతోంది. వారణాసి పాన్ వరల్డ్ మూవీ అనే స్థాయిలో రూపొందుతోంది. మరోబ ఎనిమిది నెలల్లో షూటింగ్ పూర్తి కానుండటంతో మహేష్ ఈ ప్రాజెక్ట్ నుంచి ఫ్రీ అయిపోతాడు. దీని క్రేజ్‌ని బట్టి మహేష్‌తో సినిమాలు చేయడానికి భారీ స్థాయిలో ప్రొడ్యూసర్‌లు పోటీలు పడతారు. ఇది అందరికి తెలిసిన విషయమే. అయితే మహేష్ మాత్రం దానికి సిద్ధంగా లేడట. తన మైండ్‌లో కొత్త ప్లాన్ రన్నవుతోందని ఇన్ సైడ్ టాక్. వారణాసి క్రేజ్‌ని ప్రాపర్‌గా వాడుకుంటూ బయటి బ్యానర్‌లో కాకుండా తన ఎంజీబి బ్యానర్‌లోనే నెక్స్ట్ మూవీ చేయాలనుకుంటున్నాడట. ఒకవేళ తన బ్యానర్‌లో సినిమా చేసినా అభ్యంతరం లేదని, తాను కూడా భాగస్వామిగా వ్యవహరిస్తానని ముందుకొచ్చే నిర్మాతలని కలుపుకుని సినిమా చేయాలను ప్లాన్‌లో మహేష్ ఉన్నట్టుగా ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ ప్లాన్‌లో భాగంగానే మహేష్ తన కొత్త ప్రాజెక్ట్‌ని జూన్‌లో భారీ స్థాయిలో ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నట్టుగా ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అదే నిజమైతే వారణాసి తరువాత జెట్ స్పీడుతో మహేష్ మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడం ఖాయం.

# 17 ఏళ్ల కెరీర్‌లో తొలిసారి ఆర్డర్ మిస్సైంది!




చిత్ర పరిశ్రమలో నిత్యామీనన్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రస్థానం మొదలు పెట్టి హీరోయిన్‌గా రాణిస్తోంది. 1998లో రిలీజ్ అయిన హనుమాన్ సినిమాతో బాల నటిగా పరిచయమైంది. అటుపై ఏడేళ్ల అనంతరం 2006 లో రిలీజ్ అయిన 7 ఓ క్లాక్ లో సపోర్టింగ్ రోల్‌తో అలరించింది. హీరోయిన్ గా మాలీవుడ్ లో ఆకాశ గోపురంతో 2008లో ఎంట్రీ ఇచ్చింది. అప్పటి నుంచి నిత్యా మీనన్ కెరీర్‌లో వెనక్కి తిరిగి చూడలేదు. మంచి పెర్ఫార్మర్ కావడంతో పాత్రల విషయంలో సెలక్టివ్ గా ఉండటం వంటి అంశాలు నిత్యామీనన్‌కు మంచి ఇమేజ్ తెచ్చి పెట్టాయి. మలయాళంతో పాటు, తమిళ, కన్నడ భాషల్లోనూ చాలా చిత్రాల్లో నటించింది.

అలామొదలైంది సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. నాటి నుంచి తెలుగులోనూ ఎంతో బిజీగా కొనసాగుతుంది. మొత్తంగా నిత్యామీనన్ 17 ఏళ్ల జర్నీ పరిశీలిస్తే ఏడాదికో సినిమాతో ప్రేక్షకుల మధ్యలో ఉంది. 2008 నుంచి ఎక్కడా ఆర్డర్ మిస్ అవ్వకుండా సినిమాలతో అలరించింది. 2025 లోనూ మూడు రిలీజ్‌లతో ప్రేక్షకుల్లోనే ఉంది. కాధలిక్క నెరమల్లై, తలైవవాన్ తలైవీ, ఇడ్లీ కడై చిత్రాలతో మెప్పించింది. అయితే 2024లో మాత్రం అమ్మడు ఆర్డర్ మిస్ అయిందన్నది క్లియర్. ఆ ఏడాది మాత్రం నిత్యామీనన్ ఒక్క సినిమా కూడా రిలీజ్ చేయలేకపోయింది. 2023 లో కోల్లాంబీ నిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ తర్వాత మాత్రం ఎలాంటి కమిట్ మెంట్లు లేకుండా ఖాళీగా ఉంది. 2024లో కమిట్ అయిన చిత్రాలనే 2025లో రిలీజ్ అయ్యాయి. ఆ మూడు చిత్రాలు కూడా కోలీవుడ్ లో చేసినవే. మాలీవుడ్, టాలీవుడ్‌లో ఎలాంటి సినిమాలు చేయలేదు. ఇంకా చెప్పాలంటే మూడేళ్లగా నిత్యా మీనన్ టాలీవుడ్‌కి దూరంగానే ఉంది. 2022 లో పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన భీమ్లా నాయక్‌లో నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. కానీ నిత్యామీనన్ మాత్రం కొత్త అవకాశాలు అందుకోలేకపోయింది.

మరి కొత్త ఏడాదిలో కొత్త అవకాశాల అప్ డేట్ ఏదైనా ఇస్తుందా? అన్నది చూడాలి. అయితే నిత్యామీనన్ నటిగా ప్రస్థానం మొదలైన నాటి నుంచి గ్లామర్ పాత్రలకు దూరంగానే ఉంది. నటిగా కొన్ని పరిమితులకు లోబడే పని చేసింది. ఇలా ఇండస్ట్రీలో అవకాశాలు రావడం కష్టమని తెలిసినా? గీత మాత్రం ఎన్నడు దాటలేదు. 17 ఏళ్ల ప్రయాణాన్ని అలాగే కొనసాగించింది. టెలివిజన్ షోస్, మ్యూజిక్ షోస్ హోస్టింగ్‌లోనూ తనదైన ముద్ర వేసింది.

# ‘ఈషా’.. తెలుగు రాష్ట్రాల్లో కలెక్షన్స్ ఇవే!




బన్నీ వాసు, వంశీ నందిపాటి బ్యాకింగ్ తో వచ్చిన ‘ఈషా’ సినిమా బాక్సాఫీస్ దగ్గర తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. త్రిగుణ్, హెబ్బా పటేల్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ హారర్ థ్రిల్లర్ క్రిస్మస్ స్పెషల్‌గా ఆడియెన్స్ ముందుకు వచ్చింది. ప్రమోషన్స్‌లో హారర్ ఛాలెంజ్ అంటూ చేసిన హడావిడి వల్ల ఓపెనింగ్స్ పరంగా సినిమాకి డీసెంట్ బజ్ క్రియేట్ అయ్యింది. సినిమా రిలీజ్ అయ్యాక టాక్ విషయానికి వస్తే మిక్స్డ్ రెస్పాన్స్ వినిపిస్తోంది. హారర్ ఎలిమెంట్స్ రొటీన్‌గా ఉన్నాయని, నెరేషన్ స్లోగా ఉందని రివ్యూలు వచ్చాయి. అయితే క్లైమాక్స్ ట్విస్ట్ బాగుందని కొందరు అంటున్నారు. సాధారణంగా హారర్ సినిమాలకు రివ్యూలతో, టాక్‌తో పనిలేకుండా థియేటర్‌కు వెళ్లే సెపరేట్ ఆడియెన్స్ ఉంటారు. ఇప్పుడు అదే ఈ సినిమాకి కలిసొస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకి హారర్ జానర్ లవర్స్ ప్లస్ అవుతున్నారు. సోషల్ మీడియాలో టాక్ ఎలా ఉన్నా, గ్రౌండ్ లెవెల్‌లో టికెట్ తెగుతున్నట్లు అర్థమవుతోంది. పండగ సీజన్ కావడం, పెద్ద సినిమాల పోటీ లేకపోవడం కూడా ‘ఈషా’కి అడ్వాంటేజ్‌గా మారింది. ‘ది ఫియర్.. అండ్ ది కలెక్షన్స్’ అంటూ మేకర్స్ కూడా సినిమా జోరును హైలైట్ చేస్తున్నారు. బాక్సాఫీస్ లెక్కల విషయానికి వస్తే.. లేటెస్ట్ గా చిత్ర యూనిట్ కలెక్షన్స్ పోస్టర్ ను రిలీజ్ చేసింది. దీని ప్రకారం కేవలం ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోనే ఈ సినిమా 2 రోజుల్లో 3.6 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఒక చిన్న సినిమాకి ఈ స్థాయి వసూళ్లు రావడం కచ్చితంగా మంచి నంబర్స్ అనే చెప్పాలి. మిక్స్డ్ టాక్ నడుస్తున్నా కూడా ఈ రేంజ్ ఫిగర్స్ నమోదు చేయడం అంటే, ఆడియెన్స్ హారర్ కంటెంట్ ని ఎంకరేజ్ చేస్తున్నారనే చెప్పాలి. పోస్టర్‌లో “ట్రూ క్రిస్మస్ విన్నర్” అని మేకర్స్ వేసుకున్నారు. లిమిటెడ్ బడ్జెట్ తో తీసిన సినిమా కాబట్టి, రికవరీ పరంగా నిర్మాతలు ప్రస్తుతానికి సేఫ్ జోన్ వైపే వెళ్తున్నట్లు కనిపిస్తోంది. అయితే సినిమా ఇంకా ఆడియన్స్‌ని మరింత ఎట్రాక్ట్ చేయాల్సి ఉంది. ఈ కలెక్షన్స్ వీకెండ్ మొత్తం కొనసాగితేనే బ్రేక్ ఈవెన్ మార్క్‌ని దాటే అవకాశం ఉంటుంది. సోమవారం నుంచి సినిమా హోల్డ్ ఎలా ఉంటుందనే దాన్ని బట్టి అసలైన ఫలితం తేలుతుంది. ప్రస్తుతానికి అయితే బాక్సాఫీస్ దగ్గర ‘ఈషా’ పర్ఫార్మెన్స్ పర్వాలేదనిపిస్తోంది. మరి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

# కింగ్ డమ్ సెకండ్ హాఫ్.. ఇంత పెద్ద కథ నడిచిందా..?



విజయ్ దేవరకొండ గౌతం తిన్ననూరి కాంబినేషన్ లో వచ్చిన సినిమా కింగ్ డమ్. ఈ ఇయర్ భారీ అంచనాలతో వచ్చిన సినిమాల్లో ఇది ఒకటి. ఐతే మూవీ మాత్రం అంచనాలను అందుకోలేదు. విజయ్ దేవరకొండ ఎనర్జీని గౌతం తిన్ననూరి సరిగా వాడుకోలేదు. ఐతే ఈ సినిమా ఫస్ట్ హాఫ్ అంతా ఓకే కానీ సెకండ్ హాఫ్ దెబ్బ వేసింది. ఇదే విషయంపై ఆ సినిమా నిర్మాత నాగ వంశీ రీసెంట్ ఇంటర్వ్యూలో అసలు జరిగిన స్టోరీ చెప్పారు. కింగ్ డమ్ సినిమా సెకండ్ హాఫ్‌పై చాలా డౌట్లు ఉన్నాయి. బాబాయ్ రాధాకృష్ణ గారు కూడా గౌతంతో మాట్లాడారు. దాదాపు 3 నెలల పాటు ఈ డిస్కషన్ జరిగింది. అయినా సరే గౌతం తన పట్టు విడవలేదు. మళ్లీ రావా, జెర్సీ సినిమాలు తీసిన డైరెక్టర్ కాబట్టి స్టీరియో టైప్ బ్రేక్ ఇద్దామని అతని కన్విక్షన్‌కే వదిలేశాం. కానీ అది సినిమా రిజల్ట్ మీద పడిందని అన్నారు. కింగ్ డమ్ సెకండ్ హాఫ్ మీద నాగ వంశీ అసంతృప్తి రిలీజ్ ముందే ఉందన్న విషయం ఈ కామెంట్స్ ద్వారా అర్థమైంది. దర్శకుడి విజన్‌ని నమ్మి నిర్మాత డబ్బులు పెడతాడు. ఒక్కోసారి నిర్మాత చెప్పే సలహాలు కూడా తీసుకోవాలి. ఎందుకంటే అతను కేవలం నిర్మాతగానే కాదు ఒక ఆడియన్‌గా తన జడ్జిమెంట్ ఇస్తాడు. జెర్సీ తీసిన డైరెక్టర్ కాబట్టి గౌతం మీద నమ్మకం ఉంచి కింగ్ డంని తనకు ఇష్టం వచ్చినట్టుగా తీసే ఛాన్స్ ఇచ్చారు. కానీ అది మిస్ ఫైర్ అయ్యింది. కింగ్‌డం సెకండ్ హాఫ్ ఇంకాస్త గ్రిప్పింగ్‌గా రాసుకుని ఉంటే కచ్చితంగా విజయ్ ఖాతాలో ఒక మంచి సక్సెస్ పడేది. సితార నుంచి వచ్చే ప్రతి సినిమాపై నాగవంశీ ఇచ్చే హైప్ కూడా సినిమాల ఫలితంపై ఎఫెక్ట్ పడేలా చేస్తుంది. కింగ్ డమ్ విషయంలో కూడా ఆయన చాలా కాన్ఫిడెంట్‌గా మీరు ఎక్స్ పెక్ట్ చేయని విధంగా భారీగా ఉంటుందని అన్నాడు. సినిమా భారీగానే ఉంది కానీ అది ఆడియన్స్ ని ఎంగేజ్ చేయలేకపోయింది. నాగ వంశీ ఇదే ఇంటర్వ్యూలో నానితో నెక్స్ట్ ఇయర్ సెకండ్ హాఫ్ లో సినిమా ఉంటుందని చెప్పారు. డైరెక్టర్, స్టోరీ డిస్కషన్స్ జరుగుతున్నాయని వెల్లడించారు. గౌతం తిన్ననూరి కింగ్ డమ్ రిజల్ట్ తెలిసింది. ఐతే కింగ్ డమ్ సీక్వెల్ కూడా ఒకటి ఉంటుందని చివర్లో హింట్ ఇచ్చారు. ఐతే పార్ట్ 1 రిజల్ట్ సాటిస్ఫైడ్ కాదు కాబట్టి కింగ్ డమ్ 2 ఛాన్స్ లేదనే చెప్పొచ్చు. అంతేకాదు ఇక మీదట తమ బ్యానర్‌లో సినిమాల విషయంలో త్రివిక్రం గారితో డిస్కషన్ చేస్తున్నామని ఆయన ఇన్వాల్వ్ అవ్వని రెండు సినిమాలు రిజల్ట్‌లు తేడా కొట్టేశాయని అన్నారు నాగ వంశీ.

# జడ్పీ బడ్జెట్ రూ.1,631.96 కోట్లు

## - స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదం




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం ఈ ఆర్థిక (2025-26) సంవత్సరం సవరణ బడ్జెట్‌ను, 2026-27 సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించింది. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శుక్రవారం జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో సవరించిన బడ్జెట్‌ను, అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. జడ్పీ సాధారణ సమావేశంలో చర్చించే ముందు బడ్జెట్‌ను స్థాయీ సంఘ సమావేశంలో ప్రవేశపెడతారు. వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే 2026-27లో రూ.1631.96 కోట్ల ఆదాయం వస్తుందనే అంచనాతో బడ్జెట్ రూపొందించారు. జడ్పీకి సొంతంగా రూ.24.34 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.20 కోట్లు, ఇంకా ఇతర శాఖలు ప్రధానంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖల నుంచి రూ. 1587.61 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. దీని నుంచి రూ.1612.96 కోట్లు వ్యయం అవుతుందని బడ్జెట్‌లో పొందుపరిచారు. అదేవిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ, వ్యయాలకు సంబంధించి గత ఏడాది రూపొందించిన లెక్కలను స్వల్పంగా సవరించారు. దీని ప్రకారం ఆదాయం రూ.1,626.92 కోట్లు, ఖర్చు రూ.1601.54 కోట్లుగా చూపించారు.

# పర్యావరణ హితంగా జీవించడానికి పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పర్యావరణ హితంగా జీవించడానికి పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్ ఉపకరిస్తుంది అని విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉదయం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ టీంఎన్ జిఒ ముద్రించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన 25 సంవత్సరాలుగా పర్యావరణ దినోత్సవాలు క్యాలెండర్ ముద్రించడం ఆనందదాయకం అన్నారు. ప్రతి విద్యా సంస్థలో ఈ క్యాలెండర్ వినియోగించి పర్యావరణ దినోత్సవాలు నిర్వహించాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు అవసరమైన పర్యావరణ సమాచారం కూడా అంద జేస్తుందని దీనిని విద్యా సంస్థలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్ని పర్యావరణ దినోత్సవాలు ఈ క్యాలెండర్‌లో ఉండటం వల్ల విద్యా సంస్థలకు బాగా ఉపకరిస్తుంది అని వివరించారు. ఉచితంగా విద్యా సంస్థలకు అందజేస్తున్న ఈ క్యాలెండర్ చాలా విలువైనదిగా గుర్తించి ప్రతి ఒక్కరు పర్యావరణ దినోత్సవాలు తమ సంస్థలో విద్యార్థులు చేత నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి ప్రసాద్, విజయనగరానికి చెందిన టెర్రస్ ఉద్యాన్ గ్రూప్ ప్రతినిధులు లలిత, దివ్య, జ్యోతి ప్రియాంక రమేష్‌లు, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ ఎన్జిఓ అనకాపల్లి జిల్లా హెచ్‌ఆర్డి ట్రైనర్ ఐ కృష్ణకుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం, తదితరులు పాల్గొని మాట్లాడారు.

# బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారుల విడుదలకు కూటమి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుంది

## - మత్స్యకారుల విడుదలపై ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే వంశీ శ్రీనివాస్ - ఎమ్మెల్యేను కలిసిన బోట్ అసోసియేషన్ పెద్దలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర జలాల్లోకి ప్రవేశించి బందీలుగా ఉన్న 9 మంది మత్స్యకారులను విడుదల చేయాలని కోరుతూ దక్షిణ నియోజక వర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ విశాఖ జిల్లా కలెక్టర్ గౌరవనీయులు హరేందర్ ప్రసాద్‌ని కలిశారు. మత్స్యకారులు విడుదలకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునే విధంగా తగు చర్యలు వెంటనే తీసుకోవాలని తెలిపారు. అనంతరం శివాజీ పాలెం క్యాంప్ కార్యాలయంలో బోటు అసోసియేషన్ పెద్దలు లక్ష్మణరావు అప్పారావు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కి ఇప్పటివరకు మత్స్యకారుల విడుదలకు తాము చేస్తున్న పనితీరును ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ వివరించారు. ఎఫ్ఐఆర్ కాపీతో పాటు లాయరు వాంగ్మూలం, మత్స్యకారుల క్షేమ సమాచారం, ఆరోగ్య పరిస్థితిని గురించి వివరించారు. అసోసియేషన్ పెద్దల సమక్షంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కలెక్టర్‌తో మాట్లాడి సెంట్రల్ సిబ్బంది మరియు ఇతర పెద్దలతో చర్చలు జరిపి విడుదలకు సహకరించాలని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలకు ఆదుకునే విధంగా చర్యలు చేపడుతుందని తెలియజేశారు. బంగ్లాదేశ్‌లో ఉన్న మత్స్యకారుల విడుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎంపీ శ్రీ భరత్ కృషి చేస్తున్నారని వివరించారు. అపోహలకు పోకుండా మత్స్యకార కుటుంబాలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రపంచంలో అన్ని మతాల కన్నా హిందూమతం చాలా గొప్పది

## - ప్రముఖ హిందూ ఆధ్యాత్మికవేత్త రాధా మనోహర్ దాస్ వెల్లడి





**కాకినాడ, (రాజధాని వార్తలు):** ప్రపంచంలో ఉన్న అన్ని మతాల కన్నా హిందూ మతం చాలా గొప్పదని ప్రముఖ హిందూ ఆధ్యాత్మికవేత్త రాధా మనోహర్ దాస్ తెలిపారు స్థానిక వాకలపూడి గ్రామంలో ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా ఆర్ఎస్ఎస్ వారి ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనం సభలో రాధా మనోహర్ దాస్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో ఏం మతంలో ఉన్నవారిని సరే వారు డిఎన్ఏ హిందూ మతంతో కలిసి ఉం టుందని స్పష్టం చేశారు. మతం మారినంత మాత్రాన మానవత్వం మర్చిపోవద్దు అని హితోపదేశం పలికారు. మన భారతదేశానికి జన్మించిన పాకిస్తాన్ బంగ్లాదేశ్ ఈరోజు మనకు మన మతానికి వ్యతిరేకంగా యుద్ధాలు చేస్తున్నాయని వారి పీచం అణిచి వేయాలని రాధా మనోహర్ పిలుపునిచ్చారు. ఈరోజు తులసి దినోత్సవం మిత్ర దినోత్సవం జరిగిన రోజుని ఇటువంటి రోజున ఆర్ఎస్ఎస్ వారు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమని తెలిపారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కొన్ని మతాలవారు నాశనం చేయాలని చూస్తున్నారని తెలియజేస్తూ గత వెయ్యి సంవత్సరాలుగా మన మత ధర్మంపై అనేక దాడులు జరిగిన సరే ఈరోజు కూడా మొక్కవోను ధైర్యంతో హిందూ ధర్మం ధైర్యంగా జీవనం సాగిస్తానని తెలిపారు. మన హిందువులలో ఐక్యత లేని కారణంగా మన మతంపై అనాదిగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన హిందువుల రక్షణ కోసం రిషింగు బాగ్‌లో 1925లో డాక్టర్ కేశవ్ బలరాం ఆర్ఎస్ఎస్ సంస్థను స్థాపించారని తెలిపారు. హిందూ హిందూ దేశ బందు, హిందూ హిందూ జగత్ బంధు అంటూ తల చమత్కారమైన మాటలతో అక్కడికి వచ్చిన ప్రేక్షకులను ఉర్రూతలుగించారు. ఆర్ఎస్ఎస్ వాదులు ఆదిత్య శర్మ, రామరాజు దంగేటిసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 18వ వార్డులో సామాజిక భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి నగర మేయర్ శంకుస్థాపన



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన మూడవ జోన్ 18వ వార్డు పరిధిలోని ఎంవిపి కాలనీ సెక్టర్ 9 లో సుమారు 66.50 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన సామాజిక భవనం మొదట అంతస్తు నిర్మాణానికి విశాఖ పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీ భరత్, తూర్పు నియోజక వర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, కార్పొరేటర్ గొలగాని మంగవేణిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించారని, అందుకు అనుగుణంగా నగరాభివృద్ధి జరుగుతుందన్నారు. 18 వ వార్డు ప్రజల అవసరం మేరకు సామాజిక భవనం మొదటి అంతస్థు నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేసామని తెలిపారు. అనంతరం విశాఖ పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ పేద ప్రజల ఉన్నతికి నిరంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలోని కూటమి ప్రభు త్వం పనిచేస్తుందని, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా నగరాభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రపంచ స్థాయిలో విశాఖ గుర్తింపు వచ్చిందని తెలిపారు. విశాఖ పట్నంలో ఉన్న ప్రతి వార్డును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన తెలిపారు. 18వ వార్డు ప్రజలు అవసరమయ్యే సామాజిక భవన మొదటి అంతస్థు నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేశామని తెలిపారు. తదుపరి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 18వ వార్డులో ప్రజలకు అవసరమయ్యే రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీరు మొదలైన మౌలిక సదుపా యాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేశామని, నేడు సామాజిక భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాహక ఇంజ నీరు, సహాయక ఇంజనీరు, సచివాలయం కార్యదర్శులు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పట్టాభి రామ్. వార్డు అధ్యక్షులు గొలగాని పోలారావు, పలువురు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రజా దర్బార్

## - శాసనసభ్యులు వనమాడి కొండబాబు




**కాకినాడ, (రాజధాని వార్తలు):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా కాకినాడ నగరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జగన్నాధపురం ఎన్టీఆర్ నగర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్స్ స్కూల్ ప్రాంగణంలో 19, 20, 21, 22 డివిజన్లకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి జగన్నాధపురం అన్నమాఘాటి బాలయోగి మున్సిపల్ స్కూల్ ప్రాంగణంలో 23, 24, 25, 26 డివిజన్లకు సంబంధించిన ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో ఆయా డివిజన్లకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, "ప్రజల వద్దకే అధికారులతో వెళ్లి సమస్యలను విని, వాటిని పరిష్కరించడమే ప్రజా దర్బార్ ప్రధాన ఉద్దేశ్యం" అని, గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించని అంశంపై అనేక అర్జీలు అందుతున్నాయని, ఈ విషయమై త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించి , పటవల వేమగిరి స్థలాలను సందర్శించి ఎంతమందికి పట్టాలు ఇచ్చారో ఒక నిర్ణయానికి రావడం జరుగుతుందని,. అలాగే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతి కుటుంబానికి న్యాయం చేయడం జరుగుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాకినాడ నగరాన్ని గంజాయి రహిత, రౌడీల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే కొండబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాస్, డీఈ ఆదినారాయణ, కనకారావు, ఏసీపీ శ్రీధర్, టిపిఆర్ఓ శైలజ, కార్పొరేషన్ సెక్రటరీ లక్ష్మి, స్థానిక నాయకులు గొరుసు వెంకట దుర్గారావు, గెద్దం పూర్ణ చంద్రశేఖర రావు, చింతపల్లి తాతారావు, పాలిక నాని, పసగడుగుల శేషగిరి రావు, మేడిశెట్టి ఈశ్వరరావు, ఆకుల జాన్ వెస్లీ, సంఘాని నాగూర్, బూడి ప్రకాష్, పిర్ల లక్ష్మీ ప్రసన్న రాంబాబు, మండపాక దుర్గాప్రసాద్, ఎం.డి.ఆన్సర్, పెదపూడి కుమార్, గుత్తుల రమణ, చంద్రరావు, మల్లిబాబు, కామాడి దశరథ, రామలింగేశ్వరరావు, తాడి శ్రీను, కోపనాతి నాగ కుమారి, పాలెపు రాజు, రాళ్లపూడి ప్రకాష్, సంఘాని గంగాధర్, పాలిక సూర్య, నురుకుర్తి సాయి, పాలుపు నాగేశ్వరరావు, కోపనాతి రవివర్మ, డబ్బీరు జగదాంబ, కంది కృప, శ్రీనివాస్, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నగరపాలక సంస్థ పలు చర్యలు చేపడుతున్నట్లు ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ తెలిపారు. శుక్ర వారం నగరంలోని ప్రధాన కూడలైన భానుగుడి సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిగ్నల్ లైటింగ్ వ్యవస్థను, జీబ్రా క్రాసింగ్ లైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సిగ్నల్ లైటింగ్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు సిగ్నల్ పడిన సమయంలో జీబ్రా లైన్ ముందు వాహనాలను నిలిపి, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

# ఆర్టీసిలో అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు పాత పద్ధతుల్లోనే ప్రత్యామ్నాయ ఉద్యోగాలు & ఏ.యం.బి.ఎఫ్ అమలు జిఓ విడుదల పట్ల ఇ.యు హర్షం

## - జిఓ విడుదలపై సి.యంకు కృతజ్ఞతలు : ఇ.యు.



**విజయవాడ, (రాజధాని వార్తలు):** తేది:01.01 2020 తరువాత మెడి కల్ అన్ఫిట్ అయిన ఉద్యోగులకు నిలుపుదల చేసిన ప్రత్యామ్నాయ ఉద్యోగము కానీ, అడిషనల్ మానిటరీ బెనిఫిట్స్ కానీ ఎంప్లాయీస్ యూనియన్ గా దపదపాలుగా చేసిన రిప్రెసెంటేషన్ మేరకు, గౌరవ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సహకారముతో తేది:01.01.2020 తరువాత మెడికల్ అన్ఫిట్ అయిన ఉద్యోగులకు పాత పద్దతిలో అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగము ఉద్యోగము వద్దంటే అడిషనల్ మానిటరీ బెనిఫిట్ ఇచ్చుటకు భవిష్యత్‌లో కంటిన్యూ చేస్తూ తేది: 26.12.2025 GO.Ms. No. 58 TR & B డిపార్ట్మెంట్ వారు జిఓ ఇచ్చినందుకు జిఓ ఇచ్చిన గౌరవ టిఆర్ & బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబుకి, జిఓ వచ్చుటకు సహకరించిన గౌరవ విసి & ఎండి ద్వారకా తిరుమలరావుకి ఆర్టీసీ ఉన్నతాధికార్లకు ఏపిపిటిడి(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ నుండి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇ.యు రాష్ట్ర కమిటి తరుపున సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నట్లు ఇ.యు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య శుక్రవారం ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేస్తు ఆర్టీసి హౌస్‌లో విసి & యం.డిని కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇ.యు రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి యం.డి.ప్రసాద్, జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావుతో పాటు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కాకినాడలో లా విద్యార్థులకు ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన




**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వ ర్యంలో పీఎస్ఆర్ లా కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ట్రాఫిక్-1 పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే 108 లేదా 112కు సమాచారం ఇవ్వాలని, గాయపడిన వారిని గోల్డెన్ అవర్లోపు ఆసుపత్రికి చేర్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులను రక్షించిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.25,000 విలువైన గుడ్ సమ్మరీ రివార్డు అందజేస్తారని వివరించారు. కాబోయే లాయర్లుగా సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ నడిపే వారు సీటు బెల్ట్ వాడాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్, మాడిఫైడ్ సైలెన్సర్ల వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం నిషిద్ధమని స్పష్టం చేశారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ మార్కింగ్స్, లైన్ క్రాసింగ్, సిగ్నల్ క్రాసింగ్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను యంత్రాల ద్వారా ప్రదర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాహనాలకు ఉపయోగించాలని సూచించారు. సైబర్ నేరాల విభాగంలో భాగంగా ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్ స్కీమ్స్, ఆన్లైన్ ఉద్యోగ మోసాలు, డిజిటల్ అరెస్టులపై అవగాహన కల్పించారు. 112/100, 1930, 1972 హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్ రమేష్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వంగవీటి రంగా వర్ధంతి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** ప్రముఖ కాంగ్రెస్ నాయకులు మరియు బీద ప్రజల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా యొక్క 37 వర్ధంతిని కాకినాడలో ఘనంగా జరుపుకున్నారు స్థానిక కొండయ్య పాలెంలో ఉన్న శారదాంబ గుడి వద్ద ఆయన విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు జి.మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జి వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభిమానులు హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ పేద బలహీన వర్గాల ప్రజల యొక్క అభ్యున్నతికి అహర్నిశల కృషి చేసిన గొప్ప నాయకుడు రంగా అని కొనియాడారు అలాగే ఆరు రోజులలో పాలకపక్షం ప్రజలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు తీసుకున్న సరే మొక్కవోని ధైర్యంతో వాటిని ఎదిరించిన ఘనత రంగాకు మాత్రమే దక్కుతుందని తెలిపారు. ఈరోజు మహానీయుడు రంగా మన మధ్య లేకపోయినా సరే ఆయన ప్రజలకు చేసిన సేవలు నీతికి అన్ని రాజకీయ పార్టీలు నాయకులు గుర్తించుకోవడం మన అదృష్టమని ఏసుదాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంక్షన్ బాబ్జి సీతయ్య దొర, సిద్ధి నూక రాజు కోన రాజేషు పెద్ద ఎత్తున రంగా అభిమానులు పాల్గొన్నారు.

# ఈవీఎంలకు భద్రతకు పటిష్ట చర్యలు : జిల్లా కలెక్టర్ షణ్మోహన్





**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఈవీఎం, వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మో హన్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ షణ్మో హన్.. రెవిన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికా రులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల, అగ్ని మాపక శాఖల అధికారులను ఆదేశిం చారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎంల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటి ఎం.జగన్నాథం రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (తెదేపా), ఎస్.అప్పారావు (బీఎస్పీ), పోలిశెట్టి శ్రీను(కాంగ్రెస్), కె. కృష్ణమోహన్(ఆప్), ఆర్. వెంకటేశ్వరరావు (వైఎస్సార్సీపీ), సీహెచ్.రమేష్ బాబు (భాజపా), పలివెల వీరబాబు (సీపీఎం), ఎ. సత్యనారాయణ (జనసేన) ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లు సందర్శించిన ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ



**కాకినాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన, పౌష్టికాహారం అందిస్తున్నామని కాకినాడ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.పి.వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన కాకినాడ జగన్నాథపురం అన్నమ్మ ఘాటి సెంటర్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఏర్పాట్లు, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నేరుగా ప్రజలతో మాట్లాడి క్యాంటీన్ సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరును కూడా ఆయన పరిశీలించి సూచనలు చేశారు. అన్న క్యాంటీన్‌లో అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయని, అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నామని ప్రజలు ఇంచార్జ్ కమిషనర్‌కు తెలిపారు. మీడియాతో మాట్లాడిన ఆయన, అన్న క్యాంటీన్ సేవలపై ప్రజల్లో మంచి స్పందన ఉందని, భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రజల నుంచి నిరంతరం ఫీడ్బ్యాక్ తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత



**కాకినాడ, (రాజధాని వార్తలు):** విద్యతోపాటు క్రీడలకు జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు కరస్పాండెంట్. గుత్తుల సుశీల, పేరెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సాపే. సుధాకర్ పేర్కొన్నారు. కాకినాడ సురేష్ నగర్‌లో గల జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మూడవ తరగతి చదువుతున్న కంకటాల నిహారికను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కంకటాల నిహారికకు మంచి గుర్తింపు తీసుకు రావాలని వారు పేర్కొన్నారు. మా పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న కంకటాల నిహారిక చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తుందన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్కేటింగ్ రింగ్ పోటీలలో దేశం నుంచి 21 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని, 6 నుండి 8 గ్రూపులో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం జరిగిందన్నారు. అంతేకాకుండా తూర్పుగోదావరి జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జాతీయ స్థాయిలో మెడల్ సాధించడం జరిగిందని తెలిపారు. నిహారికకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిహారిక తల్లిదండ్రులు కంకటాల సతీష్ మరియు శ్రీప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తు పల్లకి ఊరేగింపు




**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరం ధనుర్మాసం శుక్రవారం కావున ఈ నెల మొత్తం ప్రతీ రోజూ శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పములతో అలంకరించిన పల్లకిలో, ఆలయ అర్చకులు కూర్చుండబెట్టి, కొండ మీద నుండి కొండ దిగువన కనకదుర్గ అమ్మవారి ఆలయం నుండి బయలుదేరి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, అధికారులు, చిక్కాల సాయి, ఏఈవో ఎల్ శ్రీనివాస్, ఎమ్.యనమల అప్పారావు, వ్రత పురోహితులు, ఘనాపాటిలు, ఆలయ అర్చకులు, భజంత్రీలు, పాల్గొన్నారు.

# నిత్య స్మరణీయుడు పొట్టి శ్రీరాములు : ఆచార్య శరత్ చంద్రబాబు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** అమరజీవి పొట్టి శ్రీరాములు నిత్య స్మరణీయుడని, తెలుగు వారి గుండెల్లో కొలువై ఉన్న దైవమని, నేటి యువత ఆయన బాటలో నడవాలని కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య శరత్ చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమైక్య తెలుగు దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను పణంగా పెట్టిన పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి ప్రదాత, త్యాగధనుడు అని పేర్కొన్నారు. కుసుమంచి ఫౌండేషన్ అధినేత సుబ్బారావు జ్యోతి ప్రజ్వలనం చేయగా లయ లాస్య డాన్స్ అకాడమీ విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గురు ప్రసాద్ మాట్లాడుతూ లక్ష్య పరిపూర్తిలో పొట్టి శ్రీరాములు దీక్షాబద్ధుడు అని, తెలుగు వారి కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించాడని, పొట్టి శ్రీరాములకు భారతరత్న పురస్కారం వచ్చేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పేరు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిపాదించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు జీవిత విశేషాల పైన, వందేమాతరం గేయానికి 150 ఏళ్ళ నేపథ్యంలో వందేమాతరం పైన వివిధ పాఠశాలలలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన సుమారు 100 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను బహుమతులను అందజేశారు. కేల్ పురంలోని గీతాంజలి స్కూల్లో తెలుగు భాషా పరిరక్షణ సమితి, సమైక్య భారతి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ట్రైబల్ విశ్వవిద్యాలయం పరిపాలన అధికారి డాక్టర్ ఎన్ వి ఎస్ సూర్యనారాయణ, నాలుగెస్సుల రాజు, గీతాంజలి శ్రీనివాస్, సమైక్య భారత జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ గోపాలరావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, డిమ్స్ రాజు, డి శ్రీరామ మూర్తి, సుభద్ర దేవి, పాఠశాల డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ మల్లిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములపై విద్యార్థులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం అందరినీ ఆకట్టుకుంది.

# పేరాబత్తుల రాజశేఖరం పాదయాత్రలో పాల్గొన్న దాట్ల సుబ్బరాజు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం మట్లపాలెం శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి అమ్మ వారి గుడికి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం ఎన్నికల మొక్కు చెల్లించుకోవడానికి శుక్రవారం ఉదయం ఐ.పోలవరం మండలం జి.వేమవరం స్వగృహం నుండి ప్రారంభించిన పాదయాత్రకు తాళ్ళరేవులో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ ఘన స్వాగతం పలికారు, అయనతో పాటు కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, పటవల గ్రామంలో గ్రామ దేవత శ్రీ తలుపులమ్మ తల్లి ఆలయం వద్ద ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు స్వాగతం పలికారు, పాదయాత్రలో గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, చెల్లి అశోక్, కొప్పిశెట్టిబాబి, మందాల గంగ సూర్యన్నారాయణ, వినోద్, వాడ్రేవు వీరబాబు, విళ్ళ సత్యనారాయణ, ధూళిపూడి సుబ్బారావు, దుర్గాప్రసాద్, అత్తిలి బాబూరావు, విజయ్, కరిమెళ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# రామ అవతారంలో దర్శనమిస్తున్న భద్రాద్రి రామయ్య





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు స్వామివారు రామ అవతారంతో భక్తులకు దర్శనమిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రామ అవతారంతో స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వస్తుండగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడు తోంది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

# వికలాంగునికి రమణారావు రూ.15 వేలు సాయం




**ఉప్పలగుప్తం, (రాజధాని వార్తలు):** భీమనపల్లికి చెందిన వికలాంగుడు మందపల్లి వెంకట రామమూర్తికి అమలాపురం అసెంబ్లీ నియో జకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన వికలాంగుడు వెంకట రామమూర్తి గృ హ నిర్మాణం చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న రమణారావు వెంకట రామమూర్తికి సమ కూర్చిన రూ.15 వేలు చెక్కును శుక్రవారం వెంకట రామమూర్తికి గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, పందిరి సుబ్బరాజు, ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను,పరమట రాజేష్, విప్పర్తి రమేష్, ఎస్. చిరంజీవి, ఆంజనేయులు, మణికంఠ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మక్కువ మండలంలో ఫేస్ 4 భూముల రీ సర్వే ప్రారంభం



**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలంలో గల శంబర గ్రామంలో నేడు ఫేస్ ఫోర్ భూముల రీ సర్వేపై భూ యజమా నులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ భరత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు ఎదు ర్కొంటున్న భూమి యాజమాన్య హక్కుల సమస్యలు విషయంలో అవసరమయ్యే హక్కు పత్రాలను రీసర్వే సమయంలో వాటిని చూపించి భూములను దాకాలు పరుచుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా వారసత్వ భూములలో ఏర్పడే భూ పంపిణీల విష యంలో సాగు అనుభవం ఉన్నప్పటికీ భూమి తల్లిదండ్రుల పేర్లు నమోదు ఉండటం వల్ల వాటిని ఎవరెవరు ఏ భూమి సాగు చేస్తున్నారో వివరాలను నమోదు చేసుకొనే వేసులుబాటు ఉం టుందని తెలియజేశారు. జనవరి 2 నుంచి ఆరు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది అని తెలియజేశారు. ఆన్లైన్లో ఉన్న రైతులకు సమస్య లేదు ఆన్లైన్లో నమోదు లేకుండా ఉన్న ప్రతి ఒక్కరైతును గుర్తించి వారి వారి హక్కు పత్రాలను పరిశీలించి వారికి ప్రభుత్వ రాజముద్రతతో హక్కు పత్రాలను అందజేయడం జరుగుతుంది అని తెలియజేశారు. ఇంకా భూ సంబంధ విష యాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న పూర్తి పరిష్కారం జరుగుతుం దని ఇదే ప్రభుత్వ భూ సర్వే ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ భరత్ కుమార్ గ్రామ సర్పంచ్ సింహాచలం అమ్మ ఎంపీటీసీ తీళ్ళ పోలి నాయుడు మరియు గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

# ఫరెవర్ మిస్ టీన్ తెలంగాణ'గా ప్రీతి యాదవ్: జైపూర్‌లో మెరిసిన తెలుగు తేజం

## - భద్రాచలం పట్టణానికి చెందిన ప్రీతి యాదవ్



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** రాజస్థాన్ వేదికగా జరిగిన ప్రతిష్టాత్మక మిస్ టీన్ ఇండియా' గ్రాండ్ ఫినాలేలో తెలంగాణ అమ్మాయి ప్రీతి యాదవ్ తన ప్రతిభతో ఆకట్టుకుంది. ఈ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆమె, ఫరెవర్ మిస్ టీన్ తెలంగాణ' కిరీటాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర కీర్తిని చాటింది.ఈ పోటీల కోసం దేశం నలుమూలల నుండి దాదాపు 10,000 మంది యువతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఎంతో మంది పోటీదారుల మధ్య జరిగిన వివిధ వడపోత దశలను దాటుకుని, తుది పోరులో ప్రీతి యాదవ్ విజేతగా నిలిచింది. జైపూర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ గ్రాండ్ ఫినాలేలో, మోడలింగ్ రంగంలోని ప్రముఖులు మరియు న్యాయనిరే?తలు పాల్గొన్నారు. ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం మరియు తెలివితేటలతో న్యాయనిర్ణేతలను మెప్పించిన ప్రీతి, తెలంగాణ ప్రతినిధిగా టైటిల్ గెలుచుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కలలు కనడం మాత్రమే కాదు, వాటిని నిజం చేసుకోవడానికి పడే శ్రమ ముఖ్యం" అని నిరూపిస్తూ ప్రీతి యాదవ్ ఈ ఘనత సాధించింది.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985,
Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan